క్లుప్తంగా

కొత్త పింఛన్ల పంపిణీ



కోడిపల్లిలో కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా మొదటి విడత కింద 177, రెండో విడత కింద 148 మొత్తం 325 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సోమవారం ఉదయం ఆయా గ్రామ సచివాయాల్లో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

మండలాభివృద్ధికి కృషి



జెడ్పీటీసీ అనంతరాజును సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా జెడ్పీటీసీకి గదిని కేటాయించారు. దీంతో తొలి సారిగా జెడ్పీటీసీ హోదాలో అనంతరాజు కార్యాలయంలోకి అడుగు పెట్టడంతో మండల పరిషత్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన దృశ్యం

మడకశిర: మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. మండలంలోని హరేసముద్రం, సిద్ధగిరి వంకల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. రాజప్ప కర్ణాటక రాష్ట్రం పరశురామపురం గ్రామానికి చెందిన వాడు. పనిమీద పరాశురామపురం నుంచి అమరాపురం మీదుగా మడకశిర వైపు వెళ్తున్నారు. అయితే ఆలదపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న క్రేన్‌ను ఢీ కొట్టాడు. రాజప్ప తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంటనే అమరాపురం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



కంబాల లక్ష్మీనరసింహస్వామికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



హరేసముద్రం చెరువు కట్టపై కన్నేరమ్మకు జ్యోతులను తీసుకెళ్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి, కంబాల నరసింహస్వామి వార్లకు భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే హరేసముద్రం చెరువు కట్టపై వెలిసిన కన్నేరమ్మ, ఈశ్వర, ఆంజనేయస్వామి వార్లకు మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. సిద్ధగిరి కొండపై వెలిసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు జ్యోతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సింగేపల్లి నుంచి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని జక్కేపల్లికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు



చౌకదుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్

హిందూపురం అర్బన్: తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని చౌకధాన్యపు దుకాణాలు, సూపర్‌మార్కెట్‌లలో తనిఖీలు చేపట్టారు. రెండు చౌక డిపోల్లో తక్కువ తూకాలు ఇస్తుండటంతో కేసులు నమోదు చేశామన్నారు. పట్టణంలోని సూపర్‌మార్కెట్‌లలో తనిఖీలు చేయగా పలు ప్యాకేజీ వస్తువులపై తయారైన తేదీ, సంవత్సరం, అమ్మకపు ధర, కస్టమర్ కేర్ వివరాలు ముద్రించక పోవడంతో రెండింటిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్ వెంట తూనికలు కొలతల అధికారి, సిబ్బంది ఉన్నారు.

పావగడను కరువు ప్రాంతంగా గుర్తించాలి

పావగడ: 'తాలూకా వ్యాప్తంగా ఈ ఏడాది ముంగారు వానలు లేకపోవడంతో పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. తాగునీటి సమస్య కూడా ఉత్పన్నమైంది. పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలి' అని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధులు మంజూరుకు రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి కృష్ణబైరేగౌడకు లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

స్టార్టర్ చోరీ

చిలమత్తూరు: మండలంలోని లక్ష్మీపురం సమీపంలో శ్రీనివాసరెడ్డి అనే రైతుకు చెందిన స్టార్టర్‌ను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ బిందూనగర్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన అంగళ పరమేశ్వరీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరుకాగా స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కెంచప్ప, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి ప్రత్యేక పైప్‌లైన్



కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సూచనతో మండల పరిధిలోని కొటిపి ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మధ్యనే ఆ కాలనీలో గడప గడపకూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. దీంతో దీపిక వెంటనే అధికారులతో మాట్లాడటంతో కొటిపి ఎస్సీకాలనీకి ప్రత్యేక తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. సమస్య చెప్పిన వెంటనే స్పందించారంటూ దీపికను ఆ గ్రామ సర్పంచ్ సరస్వతీ, ఆదెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, బపిరెడ్డి కొనియాడారు.



గంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిల్ప

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత

అగళి: మండల పరిధిలోని ఆలుడికి చెందిన వృద్ధురాలి గంగమ్మ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పింఛన్ ఇచ్చేందుకు వెళ్లిన వలంటీర్ శిల్పకు స్థానికులు విషయం చెప్పారు. దీంతో వెంటనే ఆమె కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉన్న ఆస్పత్రికి వెళ్లి గంగమ్మకు పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో ఆమె వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'గురువు'కు వందనం

సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. విద్యార్థులకు ఎంతో ఓపిగ్గా విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. క్రమశిక్షణ, జీవితంలో ఎలా ముందుకు సాగాలో చెబుతూ విద్యార్థుల ఉన్నతికి గురువులు సహాయ పడుతున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులపై 'సాక్షి' కథనం.



తిరుపతిలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం హరిప్రసాద్ (ఫైల్)



శతక పుస్తకాలను పిల్లలకు బహుమతిగా అందజేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు కె.గంగాధర్ (ఫైల్)

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



హరిప్రసాద్, హెచ్‌ఎం, రత్నగిరి

రొళ్ల: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయడంతో పాటు నిబద్ధతతో పనిచేస్తున్నారు రొళ్ల మండలం రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హరిప్రసాద్. పిల్లలకు పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా పాఠశాల అభివృద్ధి, సమాజం ప్రగతే పరమావధిగా తనదైన శైలిలో సేవలు అందిస్తున్నారాయన. తన 25 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఇప్పటికీ ఒక్కరోజు కూడా ఎస్‌సీఎల్ పొందలేదు. 1996 నవంబర్ 2న పరిగి మండలం పుట్టగూర్లపల్లిలో ఎస్జీటీగా విధుల్లోకి చేరి 2002 వరకు పని చేశారు. 2002 నుంచి 2009 వరకు ఊటకూరులో పని చేశారు. 2002 ఆగస్టులో న్యూఢిల్లీలోని వీవీ గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్‌లో జాతీయ బాల కార్మిక రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ పొందారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2017లో తిరుపతిలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి ఆర్‌జేడీ పరకాల ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

వినూత్న పద్ధతిలో బోధన



కె.గంగాధర్

హిందూపురం టౌన్: తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూనే విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్న పద్ధతులతో విద్యాబోధన చేస్తున్నారు హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కె.గంగాధర్. 1989లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన ఆయన విద్యార్థుల్లో తెలుగుపై ఆసక్తి పెరిగేలా పాఠ్యాంశాలను కథలుగా, కథానిక, నాటిక రూపంలో విద్యార్థులతోనే చేయించడంతో పాటు వ్యాకరణ ఛత్రాలు (గడియారాలు) రూపొందించి క్రీడా పద్ధతిలో సులభతరంగా బోధన, స్వీయ అభ్యసనం చేయిస్తున్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు తెలుగులో రాణిస్తున్నారు. ఆయన అందించిన సేవలకు 2011లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో తెలుగు రక్షణ వేదిక తెలుగు భాషా పురస్కారం, 2014లో విద్యార్థి నేస్తం మానపత్రిక వారిచే ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. దీంతో పాటు పలు కవితలు, రచనలు అవార్డులను అందుకున్నారు. సకల కళా సుధానిధి అనే సార్థక కవిత పితృదేవుడు పుస్తకంలో ప్రచురించం కావడంతో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి తెలుగు అధ్యయనశాఖ నుంచి సాహితీ పురస్కారం లభించింది.

ఒకే కుటుంబంలో ఐదుగురు ఉపాధ్యాయులు



ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు

హిందూపురం: తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ ఉపాధ్యాయ వృత్తినే జీవనాధారంగా మార్చుకున్నారు కరణం కుటుంబ సభ్యులు. ఒకే కుటుంబంలో ఐదుగురు ఉపాధ్యాయులుగా రాణిస్తున్నారు. హిందూపురానికి చెందిన కరణం సుబ్బారావు 34 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆయన బాటలోనే ఆయన కుమారులు ముగ్గురూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఇద్దరు కోడళ్లు కూడా టీచర్లే కావడం విశేషం. పెద్ద కుమారుడు గురురాజరావు పరిగి మండలం మోద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. రెండు కుమారుడు సుధాకర్‌రావు సోమఘట్ట ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సుధాకర్‌రావు సతీమణి శ్రీసుధ మనేంపల్లి ఎస్సీకాలనీలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. మూడో కుమారుడు గోపీనాథ్‌రావు మడకశిర మండం సి.కొడిగేపల్లి, యూపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా ఆయన సతీమణి స్వప్న మానెంపల్లి పి.బసవపల్లి స్కూల్‌లో పనిచేస్తున్నారు.

ఒకే ఊళ్లో 80 మంది ఉపాధ్యాయులు



దొమ్మతమరి గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాల

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామం ఉపాధ్యాయులకు పెట్టింది పేరు. కేవలం 1450 మంది జనాభా, 550 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలోని ప్రజలు తమ పిల్లల్ని ఏ ఇంజనీయర్లుగానో, డాక్టర్లో కావాలనో కోరుకోవడం లేదు. ఉపాధ్యాయులుగా రాణించాలని మాత్రమే కోరుకుంటున్నారు. ఆ గ్రామంలో ప్రతి ఇంటిలోనూ ఒకరో ఇద్దరో ఉపాధ్యాయులు ఉన్నారు. కొడుకులు, కోడళ్లు, కుమార్తెలు అల్లుళ్లు ఇలా ఎంతో మంది ఉపాధ్యాయ వృత్తినే కొనసాగిస్తున్నారు. ఈ ఒక్క గ్రామంలో ప్రస్తుతం 80 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కాగా ఆ గ్రామ ప్రజలు చదువుకు ఇస్తున్న ప్రాముఖ్యతకు గుర్తుగా నిర్మించిన ఆంజనేయస్వామి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నేటికీ వందలాది మంది విద్యార్థులతో విరాజిల్లుతోంది.


వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకగ్రీవం



డిక్లరేషన్ అందుకుంటున్న సుజాత

సోమందేపల్లి: మండలంలో మూడు చోట్ల జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్‌గా యూ.సుజాత, బ్రహ్మసముద్రంలో లక్ష్మమ్మ, మండ్లిలో లీలావతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి నాగరాజురావు తెలిపారు. ఈ సందర్భంగా వారికి డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జీలాన్‌ఖాన్, పరంధామ, కిష్టప్ప, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ పాల్గొన్నారు.

కరాటేలో 'పురం' విద్యార్థుల ప్రతిభ



కటాస్ విభాగంలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

హిందూపురం: కర్నూలులోని ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో 'పురం'కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్, ఉసామాఖాన్ తెలిపారు. కటాస్ విభాగంలో ఒకరికి ప్రథమ స్థానం, ఐదుగురికి ద్వితీయ స్థానాలు, ఆరుగురికి తృతీయ స్థానాలు లభించాయన్నారు. అలాగే ఫైట్స్ విభాగంలోని వివిధ కేటగిరిల్లో ఒకరికి ప్రథమ స్థానం, ముగ్గురికి ద్వితీయ స్థానాలు, ఏడుగురికి తృతీయ స్థానాలు సాధించారన్నారు.

సంక్షిప్త సమాచారం

10 వాహనాల సీజ్

మడకశిర: నియోజకవర్గంలో సోమవారం దాడులు చేసి అక్రమంగా తిరుగుతున్న 10 వాహనాలను సీజ్ చేసినట్లు హిందూపురం ఎంవీఐ రమణ తెలిపారు. ఈ వాహనాలకు దాదాపు రూ.1.50 లక్షల వరకు అపరాధ రుసుం విధించామన్నారు. సీజ్ చేసిన వాహనాలను ఆయా ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్లకు తరలించినట్లు చెప్పారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

హిందూపురం అర్బన్: పట్టణంలోని మెయిన్ బజార్‌లో పేట వెంకటరమణస్వామి ఆలయం వద్ద ఉన్న త్యాగరాజు అనే వ్యాపారికి చెందిన దుకాణంలో సోమవారం సాయంత్రం చిరుతిళ్లు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. దుకాణం దగ్ధం కావడంతో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని పూలకుంటకు చెందిన రమణమ్మ (62) కడుపునొప్పి తాళలేక సోమవారం ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

సర్పంచ్‌కు పరామర్శ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీరామప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం పెద్దిరెడ్డిపల్లిలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సోమవారం సర్పంచ్ శ్రీరామప్ప ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

11 నుంచి ఉచిత శిక్షణ

పెనుకొండ: ఈ నెల 11 నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, నాన్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ ఆధ్వర్యంలో స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ ఫోన్ నంబర్ 9676706976 సంప్రదించాలన్నారు.

ఆలయ పునరుద్ధరణకు శ్రీకారం

అగళి: మండల కేంద్రంలో ఉన్న పురాతన శ్రీరామస్వామి దేవాలయం పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. దేవదాయశాఖ రూ.1.20 కోట్లను మంజూరు చేశారు. దాతల సాయంతో రూ.20 లక్షలు సేకరించి ఆలయ ప్లాన్‌కు ఆమోదం కూడా పొందినట్లు దేవాలయ మండలి కమిటీ అధ్యక్షులు ఏఎస్ రాజారావు తెలిపారు. సోమవారం ఆలయ పునరుద్ధరణలో భాగంగా పూజలు నిర్వహించారు. ఇక్కడున్న విగ్రహాలను శాస్త్రోక్తంగా బాలాయలయంలోకి మార్చారు.

పరిశ్రమ ముందు కార్మికుల నిరసన

హిందూపురం అర్బన్: కనీస వేతనాలు ఇవ్వడంలేదని, ప్రశ్నిస్తే ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గురునానక్ పరిశ్రమనే మూసివేశారంటూ కార్మికులు ఆ పరిశ్రమ ఎదుట సోమవారం నిరసనకు దిగారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.